

వివరాలు వెల్లడిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

# రెండు వేల నోట్లు రద్దు చేస్తున్నరని నమ్మించి

# 2 కోట్లు కొట్టేశారు

- నలుగురిని అరెస్ట్ చేసిన ఎల్‌బీనగర్ ఎస్ వోటీ పోలీసులు

**హైదరాబాద్,వెలుగు:** రూ.2 వేల నోట్లు రద్దు చేస్తున్నారని నమ్మించి రూ.2 కోట్లు కొట్టేసిన నలుగురు సభ్యుల గ్యాంగ్‌ను ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కేసు వివరాలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి చెందిన షేక్ రోషన్ మెహబూబ్(40) గతంలో చీటింగ్ కేసులో జైలుకెళ్లి వచ్చాడు. రూ.2 వేల నోట్ల రద్దు చేస్తున్నారంటూ కొంతకాలంగా మోసాలకు పాల్పడుతున్నాడు. ఇందుకోసం సన్‌సిటీలోని హిమగిరి కాలనీకి చెందిన కొలంపల్లి శ్రీనివాస్(45), ఉప్పల్‌లోని భరత్‌నగర్‌కు చెందిన బింగి వాసు(44), ఎల్‌బీనగర్‌కు చెందిన సింగమశెట్టి రాములు(40)తో కలిసి గ్యాంగ్ ఏర్పాటు చేశాడు. కొన్నిరోజుల కిందట సంతోష్‌నగర్ రక్షపురం కాలనీకి చెందిన వ్యాపారి ఎదులకంటి ప్రభాకర్ గౌడ్‌కు మెహబూబ్ తోపరిచయం ఏర్పడింది. తాను హోటల్ బిజినెస్ చేస్తానని మెహబూబ్ అతడితో చెప్పాడు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లను తొందరలోనే రద్దు చేస్తుందని, తమ వద్ద పెద్ద మొత్తంలో ఆ నోట్లు ఉన్నాయని..వాటిని రూ.500తో ఎక్స్‌చేంజ్ చేస్తే రూ.20 శాతం కమీషన్ ఇస్తామని ప్రభాకర్‌ను నమ్మించాడు. మెహబూబ్ చెప్పిన విధంగా ప్రభాకర్ రూ. 500 నోట్లను కలెక్ట్ చేసుకున్నాడు. 20 శాతం కమీషన్ వస్తుందనే ఆశతో ఫ్రెండ్స్,బంధువుల వద్ద రూ.500 నోట్లు.. కోటి 90 లక్షలు కలెక్ట్ చేశాడు. మెహబూబ్ గ్యాంగ్ చెప్పిన విధంగా ప్రభాకర్ డబ్బు తీసుకుని శనివారం ఉదయం ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ కు వచ్చాడు. డబ్బును వారికి అందించాడు. దీని గురించి సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు అక్కడికి చేరుకుని మెహబూబ్‌తో పాటు అతడి గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.కోటి 90 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీపీ చౌహాన్ తెలిపారు.

సాక్షి

# రూ.2 వేల నోటు రద్దవుతుందని.. నమ్మించి మోసం

**రూ.1.9 కోట్లు కొట్టేసేందుకు కుట్ర**

- దాడి చేసి పట్టుకున్న రాచకొండ పోలీసులు
- నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లను రద్దు చేయనుందని, తమ వద్ద భారీ మొత్తంలో ఈ నోట్లు ఉన్నాయని, రూ.500 నోట్లు ఇస్తే 20 శాతం అదనపు సొమ్ము చెల్లిస్తామని ఆశ చూపించి రూ.1.9 కోట్లు కొట్టేసేందుకు యత్నించిన మోసగాళ్లను పోలీసులు పట్టుకున్నారు. వారి కుట్రను అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

- ఏపీలోని శ్రీకాళహస్తికి చెందిన షేక్ రోషన్ మహబూబ్ హోటల్ వ్యాపారి. గతంలో ఇతనిపై ఎల్బీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ తయారీ, చీటింగ్ కేసులున్నాయి. నార్సింగిలోని హిమగిరికాలనీకి చెందిన కొలంపల్లి శ్రీనివాస్, ఉప్పల్‌లోని భరత్‌నగర్ కాలనీకి చెందిన కింగినాను, నాగోల్‌లోని బండ్లగూడ కాలనీకి చెందిన సింగం శెట్టిలతో కలిసి..ఒక రోజు సంతోష్‌నగర్‌లోని ఫ్యూర్నపురం కాలనీకి చెందిన వ్యాపారి ఎరుబకంటి ప్రభాకర్ గౌడ్‌ను కలిశారు.
- త్వరలోనే కేంద్రం రూ.2 వేల నోట్లను రద్దు చేయనుందని, రూ.500 నోట్లతో మార్పిడి చేస్తే 20 శాతం అదనపు సొమ్ము చెల్లిస్తామని ప్రభాకర్‌కు గాలం వేశారు. దీంతో నిందితుల మాయ మాటలు నమ్మిన ప్రభాకర్..తన స్నేహితులు, బంధువుల నుంచి రూ.1.9 కోట్లు నగదు సమీకరించారు. ఈ విషయాన్ని నిందితులకు తెలపడంతో వారి సూచన మేరకు ఈ డబ్బును మార్పిడి చేసేందుకు శనివారం ఉదయం ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ మోసంపై ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), ఎల్బీనగర్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నగదును సీజ్ చేశారు.

# నగదు మార్పిడి పేరుతో రూ.1.9 కోట్లు టోకరా

- గంటల వ్యవధిలో నిందితులను పట్టుకున్న పోలీసులు
- నలుగురు అరెస్ట్, రూ.1.9 కోట్లు స్వాధీనం




సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): నగదు మార్పిడితో 20 శాతం అదనంగా డబ్బు వస్తుందనే ఆశతో రూ.1.9 కోట్లు పోగొట్టుకున్నాడు. వెంటనే తేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు నిందితులను పట్టుకొని సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాచకొండ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ కేసు వివరాలను వెల్లడించారు. సంతోష్‌నగర్, రక్షపురం కాలనీకి చెందిన ఎదులకంటి ప్రభాకర్ గౌడ్(51) వ్యాపారి. చిత్తూరు జిల్లా, శ్రీకాళహస్తికి చెందిన షేక్ రోషన్ మహబూబ్(40), నార్సింగి ప్రాంతానికి చెందిన కొలంపల్లి శ్రీనివాస్(45), ఉప్పల్‌లోని భరత్‌నగర్ కాలనీకి చెందిన బింగి వాసు(44), ఎల్బీనగర్‌కు చెందిన సింగంశెట్టి రాములు(40) ముఠాగా ఏర్పడి నగదు మార్పిడి పేరుతో అమాయకులను మోసం చేయాలని పన్నాగం పన్నారు. వీరంతా ప్రభాకర్‌గౌడ్ వద్దకు వెళ్లారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం రూ.2వేలను రద్దు చేస్తున్నదని.. మా దగ్గర రూ.1.9 కోట్లు ఉన్నాయని.. రూ.2వేల నోట్లకు బదులు రూ.500లు ఇస్తే 20 శాతం కమిషన్ ఇస్తామని ప్రభాకర్‌గౌడ్‌ను నమ్మించారు. ఇది నమ్మిన ప్రభాకర్ తన వద్ద ఉన్న నగదుతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద రూ.1.9 కోట్లను సేకరించి శనివారం ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద నిందితుల ముఠాను కలిశాడు. వారు ఈ నగదు తీసుకొని పది నిమిషాల్లో రూ.2 వేల నోట్ల కరెన్సీ ఇస్తామని అక్కడి నుంచి తప్పించుకున్నారు. వారు ఎంతకూ రాకపోవడం.. ఫోన్లు సైతం స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయినట్లు గ్రహించి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులతో కలిసి గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నారు. రూ.1.9 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. సకాలంలో స్పందించి నిందితులను పట్టుకున్న ఎల్బీనగర్ పోలీసులు, ఎల్బీనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో పాటు జోన్ బృందాన్ని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ అభినందించారు.

# నగదు మార్పిడి చేస్తామని మోసం చేస్తున్న ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

**- నలుగురు నుంచి కోటి 90 లక్షలు స్వాధీనం**

**- వివరాలను వెల్లడించిన సీపీ డీఎస్ చౌహాన్**

ప్రభన్యూస్, హైదరాబాద్ :నగరంలో భారీగా హవాలా రూపంలో నగదు సరఫరా అవుతోంది. ఎలాంటి ఆధారాలు లేకుండానే కొందరు వ్యక్తులు, నగరంలో హవాల డబ్బును సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు చేపడుతున్న తనిఖీలలో భారీగా నగదు పట్టుబడుతోంది. ఈ మేరకు నలుగురు వ్యక్తుల నుంచి రూ. కోటి 90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కరెన్సీ నోట్లను ఎక్స్చేంజ్ చేస్తామని నలుగురు వ్యక్తులు రూ.కోటి 90 లక్షల మేర మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. పట్టుబడ్డ నిందితుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన షేక్ రోషన్, నార్సింగి కి చెందిన కొలంపల్లి శ్రీనివాస్, ఉప్పల్ కు చెందిన బింగి వాసు, ఎల్బీనగర్ కు చెందిన సింగంశెట్టి రాములును అరెస్ట్ చేసామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

# నోట్లు మారిస్తే 20 శాతం కమీషన్ అంటూ బురిడీ

- నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్
- రూ. 1.90 కోట్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రూ.2వేల నోట్లను ప్రభుత్వం రద్దు చేయనుందని, ఆ నోట్లను మార్పిడీ చేసి ఇస్తే 20శాతం కమీషన్ ఇస్తామని ఆశ చూపి నగదుతో ఉడాయిస్తున్న ముఠా సభ్యులను ఎల్బీనగర్ ఎస్ఓటీ, ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. చిత్తూరుకు చెందిన షేక్ రోషన్ మహబూబ్ (40) గతంలో నోట్ల మార్పిడి కేసులో ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా నార్సింగ్ సన్‌సిటీకి చెందిన కొంపల్లి శ్రీనివాస్(45), ఉప్పల్ భరత్ కాలనీకి చెందిన బింగి వాసు (44), నాగోల్‌కు చెందిన శింగంశెట్టి రాములుతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. నోట్ల మార్పిడి చేస్తే 20 శాతం కమిషన్ ఇస్తామని సంతోష్‌నగర్ రక్షాపురం ప్రాంతానికి చెందిన ఈదులకంటి ప్రభాకర్ గౌడ్ (51)ను నమ్మించారు. అతను స్నేహితుల నుంచి రూ. 1.90 కోట్లను అప్పుగా తీసుకుని వచ్చాడు. డబ్బు బదిలీ చేసుకునేందుకు వీరందరూ శనివారం ఉదయం ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ దగ్గర కలుసుకున్నారు. డబ్బు చేతిలోకి రాగానే ముఠా సభ్యులు ఉడాయించేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా పక్కా సమాచారమందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, ఎల్బీనగర్ పోలీసులు సంఘటనాస్థలంలోనే నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 1.90 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

# Four held for cheating businessman

CITY BUREAU
Hyderabad

Four persons who attempted to cheat a businessman of Rs 1.90 crore were arrested by the Rachakonda police on Saturday. The arrested persons were as Shaik Roshan Mahaboob, Kolampally Srinivas, Bingi Vasu and Singamshetty Ramulu.

According to the police, the suspects contacted E Prabhakar Goud, a businessman and informed him that they came to know the government will shortly ban Rs 2,000 notes and they wanted to exchange it for Rs 500 denomination notes. They assured to pay a commission of 20 per cent to the businessman if he agreed for the deal," said the Rachakonda police. On Saturday, businessman came to LB Nagar Metro Station with Rs 1.9 crore cash when they were caught.